# కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి



తెల్లవారేసరికి వూళ్ళో నిప్పులు పోసినట్లయింది. జనం తల్లడిల్లి పోయారు. ఎక్కడి పన్లు అక్కడ ఆగిపోయాయి. గొల్లున గోలపెడ్తూ గుళ్ళోకి పరుగెత్తు కొచ్చారు. రాత్రి ఓ దొంగ అమ్మవారి మెళ్ళో మంగళసూత్రం ఎత్తుకుపోయాడు! దేవి విగ్రహం చూసి కళ్ళనీళ్ళయిపోతున్నారు జనం. మంగళసూత్రం లేని అమ్మవారి బోసి మెడ చూడలేక గడపమీద తలలు బాదుకుంటున్నారు. తాళాలెట్లా తీశాడు!

గర్భగుడిలో అడుగెట్టా పెట్టాడు!

తల్లి మెళ్ళో చెయ్యేసి సూత్రాలెలా లాక్కున్నాడు! వాడి చేతులు విరిగి ఎందుకు పడిపోలేదు? వాడి తల వెయ్యి వక్కలై ఎందుకు పగలలేదు! ఏమైతేనేమి! ఏమి కాకపోతేనేమి! అమ్మ మంగళసూత్రం పోయింది.

'అపరాధం క్షమించు తల్లీ' అంటూ ఆర్ద్రంగా విలపిస్తున్నారు.

జమ్మి చెట్టుకింద గంగయ్య జపం చేసుకుంటున్నాడేగాని, మనసు మనసులో లేదు. అతన్ని జనం ఎవరూ పట్టించుకోరు. ఎంతెండ వచ్చినా అక్కణ్ణించి లేవడు. పిల్లలు ఆటల్లో అతని చుట్టూ చప్పట్లు కొడ్తూ పరుగులెత్తినా అతను కిమ్మనడు. కాని యివ్వాళ గంగయ్యకి జపం సాగటం లేదు. చిత్తం నిలవటం లేదు. లోకంలో దుష్టశిక్షణ చేస్తానని కంకణం కట్టుకున్నావే, అలనాడు నీ భక్తుడు 'రక్షించు దొరా!' అని పిలిస్తే చాలు శంఖుచక్రాలు కూడా వదిలేసి పరుగుపరుగున వెళ్ళి కాపాడావే! ఆ అనంత శక్తివి, సర్వవ్యాపివి, నీ మంగళ సూత్రాలు నువ్వే రక్షించుకోలేకపోయావా అమ్మా!

గంగయ్య కళ్ళవెంట కన్నీరు ధారలౌతోంది.

జనం గుసగుసలుగా భయం భయంగా అనుకుంటున్నారు. "వూరికేదో అరిష్టం వచ్చింది. ఇది లోకానికే ముప్పు!"

దేవుడిమీదా, దయ్యంమీదా నమ్మకంలేని సోమయ్య అంటున్నాడు. "నేం చెప్తే వినర్రా మీరు. రాయికీ రప్పకీ మొక్కకండిరా! అమ్మ అనుకొని బొమ్మని కొలుస్తున్నార్రా మీరు! బతికున్న మనిషిని నమ్మండిరా!" "ఆ బతికున్న మనిషే కదయ్యా తల్లి గొంతు కోసింది" అని ఇంకెవరో సమాధానం చెప్పారు.

జమ్మి చెట్టు కింద గంగయ్యకి సమన్వయం కుదరటం లేదు. అవునూ! దేవుడు తనకై తనకు తాను ఏనాడూ ఏమీ చేసుకోలేదు గదా! తనకు చేసుకుంటే పధ్నాలుగేళ్ళు అడవులు పట్టి ఎందుకుపోతాడు? బోయవాడి బాణానికి ఎందుకు పడిపోతాడు?

వూరి పెద్ద లొచ్చారు.

'చూస్తూ వూరుకుంటే ఏం లాభం? సంప్రోక్షణచేసి కొత్త మంగళసూత్రాలు తెప్పించండి' అంటున్నారు.

'కొత్తమంగళ సూత్రాలు' అనే మాట వింటేనే వెన్నెముక జలదరించింది గంగయ్యకి. గుండె కరిగిపోతోంది. జమి కదలటం లేదు. మారేడు ఉలకటం లేదు. గాలి స్తంభించింది. అంత దేవాలయం శూన్యమైపోయి శిఖరాలు, గోపురాలు ఏవీ కన్పించటం లేదు.

"అయినా తల్లికి ఇవన్నీ నీవు చేసుకున్న అలంకారాలు కావా? ఈ వెండి పాదాలు, వెండి చేతులు, మంగళసూత్రాలు నీ తృప్తి కోసం అలంకరించావేకాని ఆవిడ కవసరం లేదే ....."

కావచ్చు. యిదేదో సమాధానం చెప్పుకోవడం కోసంలా ఉంది. పిరికి తనంగా కూడా ఉన్నట్టుంది.

మళ్ళీ గంగయ్య లోపలినుంచి వాణి "ఇది నాకు పరీక్ష కాదురా! మీకు, నన్ను నమ్మిన మీకు పరీక్ష. దొంగలు పడ్డా, దోచుకున్నా మీరు నన్ను నమ్మారా లేదా అని మీకు పరీక్ష."

"నిజమేనమ్మా! నాకే పరీక్ష. మరి నా ప్రశ్నకి జవాబు దొరికితే గదా నేను పరీక్ష నెగ్గేది" అనుకున్నాడు గంగయ్య.

గంగయ్య శరీరం కాలిపోతోంది. కళ్ళు నిప్పులయి పోతున్నాయి. వొళ్ళు మసి అవుతోంది. తన వూపిరి ఉన్నట్టుండి ఆగిపోయినట్లయింది. హఠాత్తుగా చల్లగాలి వీచింది. మారేడు వాసన గుప్పుమంది. జమ్మి రెపరెపలాడింది. గంగయ్య నవ్వుతూ కళ్ళు తెరిచాడు.

లోపల అనిపించింది। పైకి అనుకున్నాడు. 'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి." కలుగునుబో కుపుత్రకుడు కల్గదుగాదె కుమాత ఎన్నడున్" తల్లీ! ఆ దొంగకూడా నీ బిడ్డడే కాదా! కొడుకు చెడ్డవాడైతే తల్లి మహిమేమి తగ్గుతుంది?'

చెంగున లేచి అమ్మవారి దగ్గర కొచ్చాడు. తల్లి ముఖం మీద పసుపు మెరుస్తూనే వుంది. పెదవులు నవ్వు చిందిస్తూనే వున్నాయి.*